‘మధ్యాహ్న’ పథకం సరకులు
పక్కదారి

- కొంతమందికి మాత్రమే వండుతున్న నిర్వాహకులు
- రికార్డుల్లో అధికంగా నమోదు
- తోటగరువు హైస్కూల్లో మాయాజాలం

ఆరిలోవ: తోటగరువు జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో మధ్యాహ్న భోజనం పక్కదారి పడుతోంది. విద్యార్థులకు అందాల్సిన ఆహార సరకుల్లో మాయాజాలం జరుగుతోంది. పాఠశాలకు కూతవేటు దూరంలోనే జిల్లా విద్యాశాఖ కార్యాలయం ఉన్నా.. అధికారులు ఈ పాఠశాలలో మధ్యాహ్న భోజనం తనిఖీ చేసిన దాఖలాలు లేవు. దీంతో ఇక్కడ ఎండీఎం వ్యవహారం ఇష్టానుసారంగా సాగిపోతోంది. జిల్లాలోని చాలా పాఠశాలలకు అక్షయపాత్ర ద్వారానే భోజనం సరఫరా అవుతున్నప్పటికీ తోటగరువు హైస్కూల్లో మాత్రం పాఠశాలలోనే వంటలు చేస్తూ, విద్యార్థులకు భోజనాలు పెడుతున్నారు. అదే నిర్వాహకులకు కాసుల పంట కురిపిస్తోంది.

కొంతమందికే ‘భోజనం’

తోటగరువు జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో ఈ విద్యా సంవత్సరంలో 1,467 మంది విద్యార్థులు ఉన్నారు. నిజానికి వారంతా ఇక్కడ మధ్యాహ్న భోజనాలు తినాలి. కానీ వారిలో పాఠశాలకు రోజూ 1,100 నుంచి 1,200 మధ్యలో విద్యార్థులు హాజరవుతున్నారు. వారిలో కొందరు భోజనాలు తినడం లేదు. భోజనాలు తినేవారిలో మరికొందరు గుడ్లు తినడంలేదు. అదే ఇక్కడ నిర్వాహకులకు కాసులు కురిపిస్తోంది. పాఠశాలకు హాజరైన వారిలో 100 నుంచి 150 మంది వరకు భోజనాలు తినడంలేదని తగ్గిస్తున్నారు. మిగిలినవారంతా తింటున్నట్లు రికార్డుల్లో రాస్తున్నారు. కానీ 400 నుంచి 500 మంది విద్యార్థులకు సరిపడగా మాత్రమే భోజనాలు వండుతున్నారు. మిగిలిన విద్యార్థులకు సంబంధించిన సరకుల్లో మాయాజాలం జరుగుతోందని ఆరోపణలు వినిపిస్తున్నాయి.

ఇదిగో నిదర్శనం

- ఈ నెల 22న శుక్రవారం 1,168 మంది విద్యార్థులు పాఠశాలకు హాజరయ్యారు. వారిలో 1,028 మంది విద్యార్థులకు భోజనాలు వండినట్లు రికార్డుల్లో చూపించారు. వంట పాత్రలలో మాత్రం భోజనాలు 500 మందికి కూడా చాలని విధంగా ఉన్నాయి. విశాలమైన పాఠశాల కావడంతో కొద్ది రోజులుగా రెండుచోట్ల పిల్లలకు భోజనాలు వడ్డిస్తున్నారు. ఒకచోట సుమారు 300 గుడ్లతో ఓ టబ్, రెండోచోట సుమారు 200 లోపు గుడ్లు ఉన్న టబ్, అన్నం, కూరల టబ్‌లు ఏర్పాటు చేశారు.

– ఈ ఏడాది అక్టోబరు 24న 1,182 మంది హాజరయ్యారు. వారిలో 1,033 మంది భోజనాలు తిన్నట్లు రికార్డులో నమోదు చేశారు. ఆ రోజు పరిస్థితీ అంతే. విద్యార్థులు ఎక్కువ మంది భోజనాల క్యారేజీలు తీసుకువస్తున్నారు. అలాంటివారు గుడ్లు మాత్రమే తినేసి భోజనం మానేస్తున్నారు. ఇక్కడే భోజనాలు చేస్తున్నా, కొందరు గుడ్లు తినడం లేదు. అదే ఇక్కడవారికి కలిసి వస్తోంది. దీంతో ప్రతి రోజూ సుమారు 500 మందికి సంబంధించిన సరకులు పక్కదారి పడుతున్నట్లు ఆరోపణలు ఉన్నాయి.

రోజుకు రూ.వేలల్లోనే..

రాష్ట్ర ప్రభుత్వం ఎండీఎం పథకంలో పాఠశాలలకు బియ్యం, గుడ్లు, చెక్కీలు సరఫరా చేస్తోంది. మిగిలిన సరకులకు ప్రభుత్వం ప్రతి విద్యార్థికి రూ.8.58 డబ్బులు ఇస్తుంది. వీటన్నింటిలో సుమారు సగం మంది విద్యార్థులకు సంబంధించిన సరకులు, ప్రభుత్వం నుంచి ఇచ్చే డబ్బులు సుమారు రూ.11,000 పైగా పక్కదారి పడుతున్నట్లు సమాచారం. విద్యార్థులకు పెట్టాల్సిన భోజనాల డబ్బులు పక్కకు పోతున్నాయని విమర్శలు వినిపిస్తున్నాయి. ఇంతమంది విద్యార్థులకు వండుతున్న చిన్న వంట పాత్రలే వీటికి నిదర్శనంగా నిలుస్తున్నాయి. 1000 మంది విద్యార్థులకు వండడానికి ఎంత పెద్ద వంట పాత్రలు ఉండాలి, లేదంటే ఎక్కువ వంట పాత్రలు ఉండాల్సిన అవసరం ఉంటుంది. ఇక్కడ మాత్రం ఉన్న చిన్న పాత్రలలోనే వారికి వండుతుండడాన్ని బట్టి విమర్శలకు బలం చేకూరుతోంది.



తోటగరువు హైస్కూల్లో మధ్యాహ్న భోజనాల కోసం వచ్చిన విద్యార్థులు, (ఇన్‌సెట్) అక్టోబరు 24న విద్యార్థుల కోసం ఉడకబెట్టిన గుడ్లు



ఈ నెల 22న విద్యార్థుల కోసం ఉడకబెట్టిన గుడ్లు



భోజనం తినకుండా గుడ్లు మాత్రమే తింటున్న విద్యార్థులు

విద్యార్థులకు సరిపడా వండిస్తున్నాం

మధ్యాహ్న భోజనం తినేవారందరికీ సరిపడగా వండిస్తున్నాం. పాఠశాలకు హాజరైన వారిలో కొందరు భోజనాలు తినడంలేదు. తినేవారికి మాత్రం పెడుతున్నాం. అందరికీ సరిపడగా గుడ్లు పెడుతున్నాం.

– భవాని, ప్రధానోపాధ్యాయిని, తోటగరువు

క్లుప్తంగా

ఉత్సాహంగా స్పోర్ట్స్ మీట్



సీపీ శంఖబ్రత బాగ్చీని సత్కరిస్తున్న రవీంద్ర

ఎంవీపీకాలనీ: ఆళ్వార్‌దాస్ పబ్లిక్ స్కూల్ ఆధ్వర్యంలో యాన్యువల్ స్పోర్ట్స్ మీట్ ఉత్సాహంగా నిర్వహించారు. ఎంవీపీ కాలనీలోని ఆళ్వార్‌దాస్ మైదానం వేదికగా శనివారం జరిగిన ఈ స్పోర్ట్స్ మీట్‌లో నగర పోలీసు కమిషనర్ డాక్టర్ శంకబ్రత బాగ్చి ముఖ్యఅతిథిగా పాల్గొన్నారు. ఆయన మాట్లాడుతూ విద్యార్థులు చదువుతో పాటు క్రీడల్లోను ఉన్నతంగా రాణించాలని సూచించారు. అనంతరం వివిధ క్రీడల్లో విజేతలుగా నిలిచిన విద్యార్థులకు ఆయన పతకాలు, సర్టిఫికెట్లు అందజేశారు. ఈ సందర్భంగా సీపీ బాగ్చిని ఆళ్వార్‌దాస్ పబ్లిక్ స్కూల్ చైర్మన్ డాక్టర్ సుంకర రవీంద్ర, కరస్పాండెంట్ డాక్టర్ విజయరవీంద్ర, ఈడీ దివ్యదాస్, సుంకర రాజేంద్ర తదితరులు సత్కరించారు. విద్యార్థుల సాంస్కృతిక ప్రదర్శనలు ఆకట్టుకున్నాయి.

సివిల్స్ శిక్షణ దరఖాస్తుకు నేడు తుది గడువు

ఎంవీపీకాలనీ: సివిల్స్ ప్రిలిమ్స్, మెయిన్స్ పరీక్షలకు సంబంధించి బీసీ స్టడీ సర్కిల్ ఆధ్వర్యంలో అందించనున్న ఉచిత శిక్షణ దరఖాస్తుకు ఆదివారంతో గడువు ముగియనుంది. ఈ శిక్షణకు అర్హులైన బీసీ, ఎస్సీ, ఎస్టీ అభ్యర్థుల నుంచి జిల్లా బీసీ స్టడీ సర్కిల్ దరఖాస్తులను ఆహ్వానిస్తోంది. అర్హులైన అభ్యర్థులు దరఖాస్తులను ఎంవీపీ కాలనీ సెక్టార్–6లోని బీసీ స్టడీ సర్కిల్ కార్యాలయంలో అందజేయాల్సి ఉంటుంది పూర్తి వివరాలకు 94925 69177 నంబర్‌లో సంప్రదించవచ్చు.

అక్రమ నిర్మాణాల పరిశీలన

ఆరిలోవ: జీవీఎంసీ పదమూడో వార్డు పరిధిలో పలుచోట్ల జరుగుతున్న అక్రమ నిర్మాణాలపై జీవీఎంసీ జోన్–2 టౌన్ ప్లానింగ్ అధికారులు దృష్టి సారించారు. ఇందులో భాగంగా టీపీవో బాలరాజు శుక్రవారం సాయంత్రం శ్రీకృష్ణాపురం, ఎస్ఎస్ఎన్ నగర్, రామకృష్ణాపురం ప్రాంతాల్లో అక్రమ నిర్మాణాలను పరిశీలించారు. అనధికారికంగా చేపడుతున్న నిర్మాణాలు, జీవీఎంసీ స్థలాలను ఆక్రమించి చేపట్టిన నిర్మాణాలను తనిఖీ చేశారు. వీటిని జీవీఎంసీ ఉన్నతాధికారుల దృష్టికి తీసుకువెళ్తానని తెలిపారు.

మంత్రికి వినతి

ఎంవీపీకాలనీ: రాష్ట్రంలోని మద్యం షాపుల్లో బీసీ కులాలకు చెందిన గీత కార్మికులకు 20 శాతం వాటా కేటాయించేలా కృషి చేయాలని విశాఖ జిల్లా శెట్టిబలిజ, గౌడ సంఘం ఆచంట ఎమ్మెల్యే పితాని సత్యనారాయణను కోరింది. విశాఖ వచ్చిన ఆయన్ను సంఘం నాయకులు నగరంలోని ఓ హోటల్‌లో శనివారం మర్యాదపూర్వకంగా కలిసి, ఈ మేరకు వినతిపత్రం అందజేశారు. సంఘం నాయకులు మాట్లాడుతూ మద్యంషాపుల్లో 15 శాతం వాటా గీత కార్మికులకు ఇవ్వనున్నట్లు ప్రకటించిందన్నారు. అయితే ఎన్నికల మ్యానిఫెస్టోలో ప్రకటించిన విధంగా 20 శాతం వాటా కేటాయించాలని కోరారు. మంత్రిని కలిసిన వారిలో సంఘం నాయకులు ఆచార్య ఎం.వివేకానందమూర్తి, గుత్తుల మధు, రేకల కృష్ణగౌడ్, పితాని ప్రసాద్, సానబోయిన శ్రీనివాస్ తదితరులున్నారు.

మహారాష్ట్రలో విజయంపై బీజేపీ సంబరాలు

ఏయూక్యాంపస్: శనివారం వెలువడిన ఎన్నికల ఫలితాల్లో మహారాష్ట్రలో బీజేపీ భారీ మెజారిటీతో విజయం సాధించడంపై విశాఖ బీజేపీ శ్రేణులు వేడుకలు జరిపాయి. పార్టీ నాయకులు శనివారం సాయంత్రం బీచ్‌రోడ్డులోని విక్టరీ ఎట్ సీ వద్ద టపాసులు కాల్చి సంబరాలు చేసుకున్నారు. కార్యక్రమంలో ఎమ్మెల్యే విష్ణుకుమార్ రాజు, మాజీ ఎమ్మెల్సీ పి.వి.ఎన్ మాధవ్, జిల్లా అధ్యక్షుడు మేడపాటి రవీంద్ర, రాష్ట్ర కోశాధికారి నాగేంద్ర, సీనియర్ నాయకులు కాశీవిశ్వనాథ రాజు, సుహాసిని ఆనంద్ తదితరులు, పలువురు పార్టీ కార్యకర్తలు పాల్గొన్నారు.

కంబాలకొండ పార్కును పరిశుభ్రంగా ఉంచాలి

- సీఎఫ్ మహ్మద్ దివాన్ మైదీన్



కంబాలకొండ పార్కు పరిసరాలను పరిశీలిస్తున్న సీఎఫ్ మహ్మద్ దివాన్ మైదీన్

ఆరిలోవ: కంబాలకొండ ఎకోటూరిజం పార్కును పరిశుభ్రంగా ఉంచాలని అటవీశాఖ కన్జర్వేటర్ ఆఫ్ ఫారెస్ట్(సీఎఫ్) మహ్మద్ దివాన్ మైదీన్ అధికారులను ఆదేశించారు. ఆయన శనివారం కంబాలకొండను సందర్శించారు. అటవీ శాఖ రేంజ్ ఆఫీసర్ శాస్త్రి, సిబ్బందితో కలసి పార్కును పరిశీలించారు. ఇక్కడ చేరుతున్న చెత్తను ఎప్పటికప్పుడు తొలగించి శుభ్రం చేయించాలని సూచించారు. కార్తీక మాసం కావడంతో పిక్నిక్‌లు జరుపుకొనేవారికి ఎలాంటి ఇబ్బందులు తలెత్తకుండా చర్యలు చేపట్టాలని రేంజర్ శాస్త్రిని ఆదేశించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ కంబాలకొండలో అభివృద్ధి పనులు చేపట్టడానికి సన్నాహాలు చేస్తున్నామన్నారు. ఇక్కడ శిథిలమైన కాటేజీలను పునర్నిర్మిస్తామన్నారు. ప్రస్తుతం బోటింగ్ కొలను ఎదురుగా కాటేజీల నిర్మాణ పనులు జరుపుతున్నట్లు తెలిపారు. సందర్శకుల కోసం అవసరమైన చోట్ల సౌకర్యాలు కల్పిస్తామన్నారు.

చెత్త తొలగించారు



శుభ్రం చేసిన స్కూల్ ముఖద్వారం

సాక్షి ఎఫెక్ట్..

బీచ్‌రోడ్డు: పెదవాల్తేరు కేడీపీఎం స్కూల్ పరిసర ప్రాంతాలను జీవీఎంసీ అధికారులు శుభ్రం చేయించారు. ఈ ప్రాంతం చెత్తతో నిండి ఉండడంతో విద్యార్థులు, స్థానికులు పడుతున్న ఇబ్బందులపై ‘పాఠశాల ఎదురుగా చెత్త డంపింగ్’ శీర్షికతో సాక్షిలో శనివారం ప్రచురితమైన కథనంపై జీవీఎంసీ అధికారులు స్పందించారు. స్కూల్ ఎదురుగా ఉన్న చెత్తను పారిశుధ్య కార్మికుల చేత తొలగించారు. దీంతో స్కూల్ ముఖద్వారం శుభ్రంగా కనిపిస్తోంది. చెత్త తొలగించటంతో విద్యార్థులు, ఉపాధ్యాయులు హర్షం వ్యక్తం చేశారు.

వైభవంగా సత్యసాయి జయంత్యుత్సవాలు

- ఉత్సాహంగా పాల్గొన్న భక్తులు, విద్యార్థులు
- ఎంవీపీ సాయి ప్రేమ సదన్‌లో పండగ వాతావరణం

ఎంవీపీకాలనీ: భగవాన్ శ్రీ సత్యసాయి బాబా 99వ జయంత్యుత్సవాలు శనివారం వైభవంగా జరిగాయి. శ్రీ సత్యసాయి సేవా సంస్థలు, సత్యసాయి సేవా సమితి సంయుక్త ఆధ్వర్యంలో ఎంవీపీ కాలనీలోని సత్యసాయి ప్రేమ సదన్‌లో నిర్వహించిన కార్యక్రమాల్లో భారీ ఎత్తున నగర వాసులు, భక్తులు, విద్యార్థులు పాల్గొన్నారు. ఉదయం బాబాకు ఏకవారాభిషేకం, ఓంకారం, సుప్రభాతం కార్యక్రమాలు జరిగాయి. బాబా బర్త్ డే ప్రత్యేక కేక్‌ను చిన్నారులు కట్ చేశారు. భక్తులు, విద్యార్థులు విశ్వశాంతికి, విశ్వమానవ కల్యాణానికి ప్రత్యేక భజనలు, సర్వమత ప్రార్థనలు నిర్వహించారు. స్వామి వారికి ఉయ్యాల సేవ, మహా మంగళహారతి నిర్వహించారు. ఈ సందర్భంగా పలు ప్రాంతాల్లో భక్తులు ఆస్పత్రుల్లోని రోగులకు, యాచకులకు, జైల్లో ఖైదీలకు బట్టలు, పండ్లు పంపిణీ చేశారు. అన్న సమారాధన, ప్రసాద పంపిణీ కార్యక్రమం జరిగాయి. నిరుపేదలకు నూతన వస్త్రాలు పంపిణీ చేశారు. కార్యక్రమంలో సత్యసాయి సేవా సమితి జిల్లా అధ్యక్షుడు పీఆర్ఎస్ఎన్ నాయుడు, సిటీ కన్వీనర్ డీవీపీఎస్ రాజు, పదాధికారులు, సేవాదళ్, యువజన విభాగం ప్రతినిధులు పాల్గొన్నారు.



సత్యసాయి బాబా జయంతి సందర్భంగా కేక్ కట్ చేస్తున్న చిన్నారులు



విశ్వశాంతిని కాంక్షిస్తూ భజనలు చేస్తున్న విద్యార్థులు

ప్రపంచం గర్వించే నాయకుడు ‘మోదీ’

- రచయిత బాల సుబ్రహ్మణ్యం
- ‘పవర్ విత్ ఇన్’ పుస్తకావిష్కరణ

విశాఖ విద్య: ప్రపంచ దేశాల్లో ప్రతి ఒక్కరూ మన ప్రధాని నరేంద్ర మోదీ గురించి తెలుసుకునేలా ‘పవర్ విత్ ఇన్’ పుస్తకంలో పొందుపరిచానని గ్రంథ రచయిత ఆర్.బాల సుబ్రహ్మణ్యం అన్నారు. ఏయూలోని డాక్టర్ వైవీఎస్ మూర్తి ఆడిటోరియంలో శనివారం జరిగిన పుస్తకావిష్కరణ సభలో ఆయన మాట్లాడారు. భారతీయ పరంపరలో భాగంగా తన అనుభవాలతో ఈ పుస్తకం రాశానన్నారు. మోదీ ప్రపంచ దేశాలు గర్వించే నాయకుడు అన్నారు. రామాయణంలో రాముడు, భరతుడు గుడ్ గవర్నెన్స్‌కు చక్కని ఉదాహరణ అన్నారు. త్వరలోనే ఈ పుస్తకం హిందీ తదితర భాషల్లో ముద్రిస్తామన్నారు. స్వల్ప కాలంలోనే ఈ పుస్తకం ఏడో విడత ముద్రణ చేశామని చెప్పారు. జాతీయ మెడికల్ కమిషన్ సభ్యుడు డాక్టర్ సంతోష్ కుమార్, ఆర్ఎస్ఎస్ ప్రచారక్ రవికుమార్ అయ్యర్, ఆంధ్రా యూనివర్సిటీ ఫైనాన్స్ ఆఫీసర్ సూర్యారావు, డాక్టర్ ఉదయ్, డాక్టర్ సోమరాజు, అధిక సంఖ్యలో విద్యార్థులు పాల్గొన్నారు.



మాట్లాడుతున్న సుబ్రహ్మణ్యం

ముగిసిన అంతర్ కళాశాలల అథ్లెటిక్స్ పోటీలు

- పురుషుల విభాగంలో అరకు ప్రభుత్వ కళాశాల
- మహిళల విభాగంలో ప్రగతి కాలేజ్‌కు ప్రథమస్థానం

విశాఖ విద్య: ఆంధ్ర విశ్వవిద్యాలయం స్పోర్ట్స్ బోర్డ్ ఆధ్వర్యంలో నిర్వహించిన అంతర్ కళాశాలల అథ్లెటిక్స్ పోటీలు శనివారం ముగిశాయి. ఈ పోటీల్లో పురుషుల విభాగంలో అరకు గవర్నమెంట్ డిగ్రీ కళాశాల తొలి స్థానాన్ని కైవసం చేసుకుంది. పురుషుల విభాగంలో ద్వితీయ స్థానంలో ప్రగతి ఫిజికల్ ఎడ్యుకేషన్, తృతీయ స్థానంలో సాలూరు గవర్నమెంట్ డిగ్రీ కాలేజ్ నిలిచాయి.

- మహిళల విభాగంలో ప్రగతి కాలేజ్ ఆఫ్ ఫిజికల్ ఎడ్యుకేషన్ విద్యార్థులు తొలి స్థానం కైవసం చేసుకున్నారు. ద్వితీయ స్థానంలో ఎంఆర్ కళాశాల, తృతీయ స్థానంలో విజయనగరం ప్రభుత్వ డిగ్రీ కళాశాల నిలిచాయి.

33 కళాశాలలు.. 620 మంది క్రీడాకారులు : 44 ఈవెంట్స్‌లో పురుషులు, మహిళల విభాగాల్లో ఈ క్రీడా పోటీలు నిర్వహించగా 33 కళాశాలలకు చెందిన 620 మంది క్రీడాకారులు హోరాహోరీగా పోటీ పడ్డారు. 100 మీటర్స్, లాంగ్ జంప్, జావెలిన్, 400 మీటర్స్ హర్డిల్స్, క్రాస్ కంట్రీ క్రీడల్లో ఉత్కంఠ భరిత పోరు జరిగింది. శనివారం సాయంత్రం జరిగిన ముగింపు కార్యక్రమంలో ఏయూ ఆర్ట్స్ కళాశాల ప్రిన్సిపాల్ ఆచార్య నరసింహారావు ముఖ్యఅతిథిగా పాల్గొని విజేతలుగా నిలిచిన క్రీడా జట్లను అభినందించారు. ఏయూ స్పోర్ట్స్ బోర్డు డైరెక్టర్ ఆచార్య ఎస్. విజయ మోహన్‌తో కలిసి విజేతలకు ట్రోఫీలు, జ్ఞాపికలు, సర్టిఫికెట్లు అందజేశారు. కార్యక్రమంలో ఏయూ ఫిజికల్ ఎడ్యుకేషన్ విభాగాధిపతి ఆచార్య పల్లవి, వర్సిటీ అనుబంధ కళాశాలల ఫిజికల్ డైరెక్టర్లు, రీసెర్చ్ స్కాలర్స్, ఎంపీఈడీ విద్యార్థులు పాల్గొన్నారు.



విజేతగా నిలిచిన అరకు ప్రభుత్వ కాలేజీ విద్యార్థులు

కంబాలకొండలో కాటేజీల పునర్నిర్మాణం

ఆరిలోవ: కంబాలకొండ ఎకో టూరిజం పార్కులో కాటేజీల పునర్నిర్మాణం జరుగుతోంది. ప్రారంభంలో పర్యాటకుల కోసం అటవీశాఖ అధికారులు ఇక్కడ పలు సౌకర్యాలు ఏర్పాటు చేశారు. వాటిలో భాగంగా ఈ పార్కు లోపల ఐదు కాటేజీలు ఏర్పాటు చేశారు. వాటిలో క్యాంటీన్ సమీపంలో మూడు, కంబాలకొండ బోటింగ్ కొలను ఎదురుగా రెండు కాటేజీలు ఏర్పాటు చేశారు. దూర ప్రాంతాల నుంచి వెళ్లే పర్యాటకులు వీటిని బుక్ చేసుకొని కుటుంబ సభ్యులతో రోజంతా గడిపేవారు. అవన్నీ ఇప్పుడు కనుమరుగయ్యాయి. హుద్‌హుద్ తుపానుకు ముందే ఇవి శిథిలమయ్యాయి. వీటిని మళ్లీ అందుబాటులోకి తీసుకురావడానికి అధికారులు ప్రయత్నిస్తున్నారు. ఇందులో భాగంగా ఇక్కడ బోటింగ్ నిర్వహించే కొలను ఎదురుగా శిథిలమైన రెండు కాటేజీలను తొలగించారు. వాటి స్థానంలో కొత్తగా మళ్లీ నిర్మాణం చేపడుతున్నారు. దీని కోసం కొద్ది రోజులుగా పనులు జరుపుతున్నారు. ఈ కాటేజీలతో పాటు వాటి ముందు సందర్శకులు సేదదీరేవిధంగా పార్కు ఏర్పాటు చేస్తున్నారు. దానిలో పూల మొక్కలు నాటించి, కూర్చునేందుకు బెంచీలు ఏర్పాటు చేయనున్నట్లు అధికారులు తెలిపారు.



కంబాలకొండలో సాగుతున్న కాటేజీల నిర్మాణ పనులు

వైజాగ్ జూనియన్ లిటరరీ ఫెస్ట్ ప్రారంభం

ఏయూక్యాంపస్: చిన్నారుల్లో విభిన్న రచనా నైపుణ్యం, సాహిత్యంపై అభిలాషను, చిత్రకళ పట్ల ఆసక్తిని పెంచే విధంగా లిట్ లాంటర్న్ ఫర్ కల్చర్, లిటరేచర్ వెల్ఫేర్ సొసైటీ నిర్వహిస్తున్న వైజాగ్ జూనియర్ లిటరరీ ఫెస్ట్ శనివారం ఘనంగా ప్రారంభమైంది. బీచ్‌రోడ్డులోని హవా మహల్‌లో నిర్వహిస్తున్న ఈ రెండు రోజుల కార్యక్రమాన్ని ఎంపీ ఎం.శ్రీ భరత్ ప్రారంభించారు. ఆయన మాట్లాడుతూ చిన్నారులకు విభిన్న రంగాలలో ప్రవేశం, ప్రావీణ్యం కల్పించడానికి, వారి ఊహలకు అవకాశం కల్పించే వేదికగా ఇది నిలుస్తోందన్నారు. లిట్ లాంటర్న్ సొసైటీ ప్రతినిధి సంధ్య గోడే మాట్లాడుతూ రెండు రోజుల ఉత్సవంలో 4 నుంచి 16 సంవత్సరాల విద్యార్థులు పాల్గొంటున్నారన్నారు. ప్రతీ రోజు 44 సెషన్స్ ఉంటాయని, తల్లిదండ్రులు కూడా పాల్గొనే విధంగా కొన్ని సెషన్స్ ఏర్పాటు చేశామని తెలిపారు. ఇంగ్లిష్, హిందీతో పాటు తొలిసారిగా తెలుగులోనూ కొన్ని సెషన్స్ ఏర్పాటు చేస్తున్నామన్నారు. కార్యక్రమంలో ప్రఖ్యాత రచయితలు, చిత్రకారులు, కథకులు పాల్గొని ప్రత్యక్షంగా అవగాహన కల్పించారు. కార్యక్రమంలో హవామహల్ నిర్వాహకులు మయూఖ డియో, నిర్వాహకులు సోనాల్ శర్మా, ప్రియ ఉప్పల పాటి తదితరులు పాల్గొని ప్రసంగించారు. కార్యక్రమంలో వివిధ పాఠశాలల చిన్నారులు పాల్గొన్నారు. ప్రాంగణంలో ఏర్పాటు చేసిన పుస్తక ప్రదర్శనను చిన్నారులు ఆసక్తిగా తిలకించారు. విభిన్న రంగాల నిపుణులు అందించిన ప్రసంగాలు చిన్నారుల్లో ఉత్తేజం నింపాయి.



ఫెస్ట్‌ను ప్రారంభిస్తున్న నిర్వాహకులు

ప్రతీ దృశ్యం కొత్త ఆలోచనకు బీజం

మన ఆలోచనలతో మాట్లాడే ప్రయత్నం చేయాలని అమర్ చిత్రకథ ప్రైవేట్ లిమిటెడ్ గ్రూప్ ఆర్ట్ డైరెక్టర్ సావియో మస్కరెన్హాస్ అన్నారు. వైజాగ్ జూనియర్ లిటరరీ ఫెస్ట్‌లో భాగంగా ఆయన విజువల్ ఆర్ట్స్ ఉపయోగించి చిన్నారుల్లో అభ్యసనం, సృజనాత్మకతను వృద్ధి చేయడం అనే అంశంపై ప్రసంగించారు. ప్రతీ దృశ్యం ఒక కొత్త ఆలోచనను మనలో రేకెత్తిస్తుందని పలు ఉదాహరణలతో వివరించారు. చిన్నారుల్లో సృజనాత్మకతను పెంపొందించే విధంగా విజువల్ ఆర్ట్ సహకరించే విధానాలను వివరించారు.



ప్రసంగిస్తున్న ఆర్ట్ డైరెక్టర్ సావియో

భక్తిశ్రద్ధలతో చండీ పారాయణం



చండీ పారాయణం చేస్తున్న మహిళలు

ఎంవీపీకాలనీ: ఎంవీపీ కాలనీ సెక్టార్–4లోని చండికాదేవి ఆలయంలో శనివారం చండీపారాయణం నిర్వహించారు. స్థానిక భక్తురాలు విమల ఆధ్వర్యంలో మహిళలు పెద్ద ఎత్తున కార్యక్రమంలో పాల్గొని, అమ్మవారి సమక్షంలో పారాయణం చేశారు. కార్తీకమాసాన్ని పురస్కరించుకుని తొలుత అమ్మవారికి ప్రత్యేక పూజలు నిర్వహించిన అనంతరం, పారాయణం చేశారు. కార్యక్రమంలో ఆలయ కమిటీ అధ్యక్షుడు పొట్టి రమణ తదితరులు పాల్గొన్నారు.

కృష్ణా కళాశాల అధ్యాపకుడికి ప్రతిష్టాత్మక అవార్డు

మద్దిలపాలెం: డాక్టర్ వి.ఎస్.కృష్ణా ప్రభుత్వ డిగ్రీ కళాశాల సంస్కృత సహాయ ఆచార్యులు డాక్టర్ పోలా ఉమామహేశ్వరరావుకు వెల్ రెడ్ ఫౌండేషన్, నీతిఆయోగ్ ఇండియా ప్రదానం చేసే ఆర్యభట్ట ఇంటర్నేషనల్ ఎడ్యుకేషనిస్ట్ అవార్డు లభించింది. ఈ నెల 21న జాతీయ స్థాయిలో వర్చువల్‌గా ఆయనకు ఈ అవార్డు ప్రదానం చేశారు. ఈ సందర్భంగా కళాశాలలో శనివారం నిర్వహించిన కార్యక్రమంలో ఉమామహేశ్వరావును కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ ఐ.విజయబాబు, వైస్ ప్రిన్సిపాల్ డాక్టర్.పి.జయ, అధ్యాపకులు అభినందించారు.



ఉమామహేశ్వరరావును అభినందిస్తున్న ప్రిన్సిపాల్ తదితరులు

అప్పన్నను దర్శించుకున్న గుజరాత్ హైకోర్టు న్యాయమూర్తి

సింహాచలం: శ్రీ వరాహ లక్ష్మీనృసింహస్వామిని శనివారం గుజరాత్ హైకోర్టు న్యాయమూర్తి జస్టిస్ మానవేంద్రనాథ్‌రాయ్ దర్శించుకున్నారు. ఆలయ ధ్వజస్తంభం వద్ద ఆయనకు అర్చకులు పూర్ణకుంభంతో స్వాగతం పలికారు. అనంతరం ఆయన ఆలయంలోని కప్పస్తంభాన్ని ఆలింగనం చేసుకుని బేడామండపంలో ప్రదక్షిణ చేశారు. అంతరాలయంలో ఆయన పేరిట ప్రత్యేక పూజలు నిర్వహించారు. వేద ఆశీర్వచనం అందజేశారు. ఆలయ సంప్రదాయం స్వామి ప్రసాదం, జ్ఞాపికలను ఏఈవో ఆనంద్‌కుమార్ అందజేశారు.

పీవీజీ రాజు శత జయంతి వేడుకలు రేపు

- డా.అశ్వతీ తిరునాళ్ గౌరీ లక్ష్మీబాయికి పీవీజీ రాజు ఆధ్యాత్మిక పురస్కారం

మద్దిలపాలెం: ఆంధ్ర సారస్వత పరిషత్, మాన్సాస్ సంయుక్త ఆధ్వర్యంలో డాక్టర్. పీవీజీ రాజు శత జయంతి వేడుకలను ఈ నెల 25వ తేదీన విశాఖ వేదికగా నిర్వహించనున్నారు. ఆంధ్ర విశ్వవిద్యాలయం ఇంజినీరింగ్ కళాశాల ప్రాంగణంలోని డాక్టర్. వైవీఎస్ మూర్తి ఆడిటోరియంలో ఉదయం 9 గంటల నుంచి శత జయంతి ఉత్సవాలను ప్రారంభం కానున్నాయి. కార్యక్రమానికి ముఖ్య అతిథిగా వారణాసి దేవాలయ ట్రస్టీ డాక్టర్. బ్రిజ్ భూషణ్ ఓఝా, గౌరవ అతిథులుగా కేంద్ర మాజీ మంత్రి అశోక్ గజపతిరాజు, జస్టిస్ డీవీఎస్ఎస్ సోమయాజులు హాజరు కానున్నారు. ఆంధ్ర సారస్వత పరిషత్ అధ్యక్షుడు డాక్టర్. గజల్ శ్రీనివాస్ సభాధ్యక్షుడిగా వ్యవహరించనున్నట్లు పరిషత్ మూడో ప్రపంచ తెలుగు మహాసభల ముఖ్య సంచాలకుడు పి.రామచంద్రరాజు, పరిషత్ కార్యదర్శి రెడ్డప్ప ధవేజీ ఒక ప్రకటనలో తెలిపారు. కార్యక్రమంలో భాగంగా ట్రావెన్‌కోర్ సంస్థానానికి చెందిన ప్రిన్సెస్ డాక్టర్. అశ్వతీ తిరునాళ్ గౌరీ లక్ష్మీబాయికి డాక్టర్. పీవీజీ రాజు ఆధ్యాత్మిక పురస్కారాన్ని ప్రదానం చేయనున్నట్లు తెలియజేశారు.